

భవితవ్యానికి 'సహకారం'

రైతులు, ప్రజలకు సేవలందిస్తున్న డీసీసీ బ్యాంకు మరో అడుగు ముందుకేసింది. చిన్నారుల భవిషత్తుకు ఆసరాగా నిలవనుంది. -10లో



రెజ్లింగ్ జట్టు ఎంపిక

జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ జట్టు ఎంపికలు ఏఐటీఎస్‌లో శుక్రవారం జరిగాయి. జేఎన్‌టీయూ–ఏ సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి హాజరయ్యారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.200	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 293 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

27న ఫెన్సింగ్ ఎంపికలు

మదనపల్లె సిటీ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఫెన్సింగ్ అండర్–14 బాల,బాలికల జిల్లా ఎంపికలు జరుగుతాయని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. చిత్తూరు సమీపంలోని సిద్దంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలుంటాయన్నారు. 01-01-2010వ తేదీ తరువాత పుట్టిన విద్యార్థులు మాత్రమే అర్హులని, డేట్ ఆఫ్ బర్త్, చైల్డ్ ఇన్ఫో నంబర్ తీసుకురావాలన్నారు. వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రారెడ్డిని 9440345455 నంబరులో సంప్రదించాలన్నారు.

మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న ప్రజారవాణాధికారి రాము

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. శుక్రవారం మదనపల్లి–2 డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈపీకే, ఓఆర్ పెంచాలన్నారు. ఆదాయం బాగా వస్తున్న రూట్‌లలో బస్సులను రెగ్యులర్‌గా తిప్పాలన్నారు. బస్సుల నిర్వహణలో మదనపల్లె–1 డిపో మొదటి స్థానం, మదనపల్లె–2 రెండో స్థానం, పీలేరు మూడవ స్థానం సాధించాయన్నారు. కాగా, కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాలకు స్పెషల్ సర్వీసులు నడుపుతున్నట్లు డీపీటీఓ రాము తెలిపారు. కార్యక్రమంలో డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సీఐలు రేవతి, గీత తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల్లో 150 రోజుల ఉపాధి



ఫీడర్ చానల్ పనులు పరిశీలిస్తున్న మద్దిలేటి

బి.కొత్తకోట: ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో 150 రోజుల ఉపాధి పనిదినాలు కల్పిస్తామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సంఖ్యను పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఖ్య ఎందుకు తగ్గిందని అధికారులను ప్రశ్నించారు. కూలీల సంఖ్య పెంచడంతో పాటు కరువు మండలం కారణంగా పెరిగే పనిదినాలను కూలీలకు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కూలీల హాజరును నమోదు చేసే యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేటపుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏపీడీ ఎస్.మధుబాబు, ఏపీఓ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జోన్–4 బదిలీలపై విచారణ

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో జరిగిన సాధారణ బదిలీల ఆరోపణలపై శనివారం విచారణ జరగనుంది. ఈ శాఖ పరిధిలో జూన్ నెలలో బదిలీలు జరిగాయి. వీటిపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు విచారణకు ఆదేశించారు. కాగా గతంలో ఇక్కడ రీజినల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం అమరావతిలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కోటేశ్వరి విచారణాధికారిగా రానున్నారు.

వైవీయూలో జాతీయ సదస్సు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో 'వనవిల్ కె.రవి రచనల్లో భిన్న దృక్పథాలు' అన్న అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు, సెమినార్ సంచాలకులు ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈ సెమినార్‌కు వీసీ ఆచార్య చింతా సుధాకర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది వనవిల్ కె.రవి, తిరుమల ఎస్వీ మ్యూజియం డైరెక్టర్ ఆచార్య ఎస్.కృష్ణారెడ్డి, అజ్మీర్ రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.లక్ష్మిఅలియార్‌లు హాజరవుతారని తెలిపారు.

రేపు డాక్టర్ ఇండ్లకు సన్మానం

కడప రూరల్: వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ గ్రహీత, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి ఈ నెల 26వ తేదీన కడపలో సన్మానం చేయనున్నట్లు ఆహ్వాన సంఘం సభ్యులు డాక్టర్ సి.బాలిరెడ్డి తెలిపారు. విజయవాడలో స్థిరపడ్డ జిల్లావాసి డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఇటీవల ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఉదయం 10 గంటలకు సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



టీబీపై టీకాస్త్రం

- టీకా వేసేందుకు ప్రణాళికలు
- తొలుత ఆరు కేటగిరీల్లోని వారికి ప్రాధాన్యం
- కసరత్తు చేస్తున్న క్షయ నివారణ విభాగం



టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

మదనపల్లె సిటీ: క్షయ..చాపకింద నీరులా విస్తరిస్తోంది. తుమ్మినా..దగ్గినా ..నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణం మీదుకు తెస్తుంది. ఈ క్రమంలో టీబీ కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా బాధితులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతోంది. చిన్నపాటి లక్షణాలు కనిపించినా ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు చేయిస్తోంది. వ్యాధి నిర్ధారణ అయితే సకాలంలో వైద్య సేవలందిస్తోంది. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు పౌష్టికాహారం పంపిణీ చేస్తోంది ఎప్పటికప్పుడు నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందిస్తోంది. జిల్లాను క్షయరహితంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే వ్యాక్సినేషన్‌కు శ్రీకారం చుట్టనుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలోని 30 మండలాల్లో ఉన్న గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఎంత మందికి టీకా అవసరమవుతుందనే వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం 3,34,777 మందికి డోసులు కావాలని నిర్ణయించారు. కరోనా వ్యాప్తి సమయంలో చేపట్టిన విధంగానే టీటీటీ(ట్రేసింగ్, టెస్టింగ్, ట్రీట్‌మెంట్) విధానాన్ని ప్రస్తుతం టీబీ నియంత్రణలోనూ అమలు చేయాలని భావిస్తున్నారు. బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అన్ని రాష్ట్రాలకు సూచనలు జారీ చేసింది. గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా ఆ పనిని వేగవంతం చేయడంతో జిల్లాలో 30 మండలాల్లో వచ్చే నెల బీసీజీ వ్యాక్సిన్ పంపిణీకి తగు ప్రణాళికలు రూపొందిస్తుంది.

టీబీ యూనిట్లు: 09
ఈ ఏడాది నమోదైన క్షయ రోగులు: 1,448 మంది
బీసీజీ టీకా వేయనున్నవారు: 3,34,777 మంది

గ్రామ స్థాయిలో వివరాల సేకరణ

తొలుత ఆరు అంశాలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తూ టీకా వేయనున్నారు.గ్రామస్థాయిలో సర్వే చేపట్టి టీకా పంపిణీకి అర్హులైన వారి ఎంపిక చేపడుతున్నారు. ఈ క్రమంలోనే డిసెంబర్ 15వ తేదీ తర్వాత జిల్లాలో టీబీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు

లక్షణాలు



- రెండు వారాలకు మించి దగ్గు
- ఔషధాలు వాడిని పక్షం రోజులు పాటు తగ్గని జ్వరం
- శరీర బరువు తగ్గిపోవడం
- ఛాతీ ఎక్స్‌రేలో మార్పు
- దగ్గినప్పుడు ఉమ్మిలో రక్తం కనిపించడం

వ్యాక్సినేషన్ ఇలా..

- టీబీ వచ్చి తగ్గిన వారికి
- 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు
- మధుమేహం బాధితులకు
- 18 సంవత్సరాలు తక్కువ ఉన్న వారు..అయిదు సంవత్సరాల క్రితం టీబీ వ్యాధిగ్రస్తులు
- 2021 నుంచి 2023 టీబీ వ్యాధిగ్రస్తులు ఇంట్లో ఉన్న 18 సంవత్సరాలు పైబడినవారు
- ధూమపానం చేసేవాళ్లకు

క్షయ రహితమే లక్ష్యం



జిల్లాను క్షయ రహితంగా తయారు చేయడమే లక్ష్యం. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అదే సమయంలో నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. డిసెంబర్ 15 తర్వాత జిల్లాకు టీకా రానుంది. ఈ క్రమంలో టీకా అవసరమైన వారిని గుర్తించే ప్రక్రియలో ఉన్నాం.

–డాక్టర్ శైలజ, జిల్లా క్షయ నివారణ అధికారి, అన్నమయ్య జిల్లా

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి :విద్యార్థులు ఆధునిక శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో కలామ్ విజన్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలాం విజన్ ఎక్స్ పో–2023లో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, రాయలసీమ జోన్ కరస్పాండెంట్ మహేష్ కుమార్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సైన్స్ ప్రదర్శన నిర్వహించడం వల్ల విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ అంశాలపై అవగాహన పెరుగుతుందని, చదువుమీద ఆసక్తి కలుగుతుందన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని శాస్త్రవేత్తగా రాణించాలన్నారు. దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ దేశాలకు తెలియజేసేలా ఎదగాలన్నారు. సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థులలో విజ్ఞానం, వికాసం అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థుల కోసం ఇలాంటి ప్రదర్శన నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

- కార్యక్రమంలో ఏపీ ఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, పీఆర్‌టీయు క్రమశిక్షణ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహా రెడ్డి, డైట్ లెక్చరర్ శ్రీదేవి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి, ఇంటర్ నేషనల్ హైస్కూల్ హెడ్ మాస్టర్ ఇలియా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్

అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. రాష్ట్రానికి చెందిన పేద విద్యార్థులు అమెరికాలో రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానాలపై మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసిందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సృజనాత్మక ఆలోచలను అలవరుచుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ సైన్స్ ఫేర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాయలసీమ జోన్ కమాండెంట్ మహేష్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు మాట్లాడుతూ జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు.

పోస్ట్ ద్వారా రూ.2వేల నోట్ల మార్పిడికి అవకాశం

తపాలాశాఖ రాజంపేట సబ్‌డివిజన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్

రాజంపేట టౌన్: తపాలా కార్యాలయాల నుంచి ఆర్‌బీఐకి రెండువేల రూపాయల నోట్లు పంపి మార్చుకునే అవకాశాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కల్పించినట్లు తపాలాశాఖ రాజంపేట సబ్‌డివిజన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండువేల రూపాయల నోట్లను ప్రజలు బ్యాంక్, తపాలాశాఖ ఎస్‌బీ ఖాతాల ద్వారా మార్చుకునే గడువు అక్టోబర్ 7వ తేదీతో ముగిసిందన్నారు. నిర్ణీత గడువులో నోట్లను మార్చుకోలేని వారికి ఆర్‌బీఐలో మార్చుకునే అవకాశం ఉందన్నారు. అయితే దేశవ్యాప్తంగా అతి తక్కువ ప్రాంతాల్లో మాత్రమే ఆర్‌బీఐ కేంద్రాలు ఉన్నందున ప్రజలు రూ. 2వేల నోట్లను మార్చుకోవడం కష్టతరం అవుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోస్ట్ ద్వారా పంపి మార్చుకునే అవకాశం కల్పించిందన్నారు. అందువల్ల ఎవరి వద్ద అయినా ఇంకా రెండువేల రూపాయిల నోట్లు ఉంటే తమకు సమీపంలోని తపాలా కార్యాలయాలకు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలతో పాటు మూడంచెల రక్షణ కవర్‌ను తీసుకెళితే సిబ్బంది దరఖాస్తు ఫారం ఇస్తారన్నారు. దీనిని పూరించి, జిరాక్స్ కాపీలను జతపరచి తపాలాశాఖ సిబ్బంది ఎదుట కవర్‌లో దరఖాస్తుతో పాటు రెండువేల రూపాయిల నోట్లను పెట్టి భద్రంగా అతికించాలని తెలిపారు. ఒక వ్యక్తి పది రెండు వేల రూపాయిల నోట్లను మాత్రమే పోస్ట్ ద్వారా ఆర్‌బీఐకి పంపాల్సి ఉంటుందన్నారు. ఎంత నగదు పంపితే అంత నగదుకు ఇన్సూర్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. చివరగా కవర్‌పై ఆర్‌బీఐకి సంబంధించిన చిరునామా రాసి స్పీడ్ పోస్టు చేయాలని అమర్‌నాథ్ తెలిపారు.

గండికోటలో వెలుగు చూసిన శాసనం

కడప కల్చరల్: ప్రముఖ పర్యాటక, చారిత్రక ప్రాంతమైన గండికోటలో మరో శాసనం వెలుగు చూసింది. కోటలోని దేవాలయం చప్పట బండపైగల రాతి మీద నాటి తెలుగు లిపిలో ఈ శాసనం లిఖించి ఉందని భారత పురాతత్వశాఖ ఎపిగ్రఫీ విభాగం ప్రతినిధి ఆచార్య మునిరత్నంరెడ్డి తెలిపారు. 16వ శతాబ్దం నాటి ఈ శాసనం బహుశా నాటి పాలకుడు దుగ్గరాజు ఆరాధ్యదైవం రామలింగేశ్వరస్వామి పట్ల భక్తి ప్రవత్తులను చాటుకునేందుకు వేయించినట్లు తెలుస్తోందన్నారు.



గండికోటలో వెలుగు చూసిన శాసనం

సమానత్వ నినాదంతో పెద్దదర్గా ఉరుసు



విలేకరులతో మాట్లాడుతున్న దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్: పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలు ఈ ఏడాది వినూత్నమైన పద్ధతిలో జరగనున్నాయని దర్గా ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం దర్గాలోని ముషాయిరా హాలులో వారు విలేకరులతో మాట్లాడారు. దర్గా పీఠాధిపతి సర్వమత సమానత్వాన్ని కాంక్షిస్తారని, ఇందులో భాగంగా ఈసారి ఉరుసు ఉత్సవాలు మత సామరస్యానికి నిలువెత్తు ప్రతీకగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దర్గా మేనేజర్ ఎస్‌ఎండీ అలీఖాన్ వివరించారు. దర్గా పట్ల దేశ విదేశాల్లో అచంచల భక్తి విశ్వాసాలుగల వారెందరో ఉన్నారని, పెద్ద సంఖ్యలో ఉరుసు ఉత్సవాలకు రానున్నారని, వారందరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దర్గా సమీపంలోని బాల పోలేరమ్మ, బాలాజీ ఆలయం, పాండురంగస్వామి ఆలయం, మాచుపల్లె సర్కిల్‌లోని బెత్లెహం చర్చి తదితర ప్రాంతాలను శుభ్రపరిచి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. 27న మేరీ మిలన్ పేరిట అన్ని వర్గాల ప్రముఖులను ఆహ్వానించి విందు ఇవ్వనున్నట్లు చెప్పారు. దర్గా ముజావర్ అమీర్ మాట్లాడుతూ 26న రాత్రి మలంగ్‌షా దీక్ష వహించడంతో ఉరుసు ప్రారంభమవుతుందన్నారు. అదేరోజు గంధం, 27న ఉరుసు ఉంటుందన్నారు. ఆరోజున కడప పరిధిలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని అధికారులకు విన్నవించామన్నారు. 30న పీఠాధిపతి ఊరేగింపు ఉంటుందన్నారు. దర్గా ప్రతినిధి ఆరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ ముషాయిరాలో ప్రముఖ కవులు పాల్గొంటారన్నారు. ఉరుసు ఉత్సవాల ప్రారంభ సూచికగా శనివారం ఉదయం 9.30 గంటలకు దర్గా ప్రాంగణంలో బెలూన్‌ను ఆవిష్కరించి ఎగుర వేయనున్నట్లు దర్గా ప్రతినిధులు తెలిపారు. దర్గా ప్రతినిధులు ఖుతుబుద్దీన్, ఆరీఫ్, అన్వర్, ఖాసిం, ఫైజుద్దీన్ పాల్గొన్నారు.

అరకొర గుంత.. అదే వారికి వింత

- పచ్చగంతలు కట్టి.. పిచ్చిగుంతలకు దడికట్టి
- టీడీపీ, జనసేన దొంగాటకం
- లక్షణంగా ఉన్న రహదారులు
- కళ్లు తెరిచి చూడమంటున్న ప్రజలు

ఫ్యాక్ట్ చెక్



గుంతలు లేని కోడూరు–కే బుడుగుంటపల్లె రహదారిపై టీడీపీ నాయకుల హడావుడి (ఫైల్)



రూ. 120 లక్షల వ్యయంతో గాలివీడు మండలం గోపనపల్లె నుంచి లక్కంవాండ్లపల్లె వరకు నిర్మించిన రహదారి



ఏఎంసీ గ్రాంటు కింద కొండాపురం మండలం వంగనూరు నుంచి కోడూరు వరకు నిర్మించిన రోడ్డు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా రహదారులపై టీడీపీ, దాని అనుబంధ జనసేన నాయకులు గత శని, ఆదివారాల్లో నానా యాగీ చేశారు. 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ' అని ఓ కార్యక్రమం పెట్టుకున్నారు. ఏదో ఒక విధంగా ప్రభుత్వంపై బురదజల్లుతూ ప్రజలను మభ్యపెట్టడం ద్వారా రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రోజుకొక కొత్త నాటకానికి తెర తీయడంలో భాగమే ఈ గుంతల కార్యక్రమం. ఇందులో భాగంగా రోడ్లపై అరకొరగా ఏర్పడిన గుంతలను ఫొటోలు, వీడియోలు తీసారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టి క్షణికానందం పొందారు. ఎలాంటి రహదారిపైన అయినా కొన్నేళ్ల తర్వాత చిన్నపాటి గుంతలు ఏర్పడటం ఎక్కడైనా సహజమే. అలా ఎక్కడో ఒకటి, రెండుచోట్ల ఉన్న చిన్న గుంతలను టీడీపీ, జనసేన నాయకులు భూతద్దంలో చూపించే ప్రయత్నం చేశాయి. వీటికి చిలువలు పలవలు జోడించి వింత వ్యాఖ్యానాలతో మీడియాలో మాటలతో గారడీ చేయబూనారు. పైగా రోడ్డు ప్రమాదాలన్నీ వీటి వల్లే జరిగాయని, ప్రమాద మరణాలన్నీ ప్రభుత్వ హత్యలంటూ పేర్కొనడం వీరి వికృతపోకడలకు పరాకాష్ట. వీరి చిత్తచాపల్యం గమనించినవారు.. మరి 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో జరిగిన వేలాది రోడ్డు ప్రమాద మరణాలు కూడా ప్రభుత్వ హత్యల కిందకు రావా అని ప్రశ్నిస్తున్నారు.

రహదారులకు ప్రాధాన్యత

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రహదారుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ కనెక్టివిటీ ప్రాజెక్టు (ఏపీ ఆర్‌ఆర్‌పీ) గ్రాంటు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ప్యాకేజీ, పీఎంజీఎస్‌వై ఫేజ్–3, ఏఎంసీ గ్రాంటు కింద జిల్లాలో ఎన్నో కొత్త రహదారులు ఇప్పటికే రూపుదిద్దుకున్నాయి. ఇప్పుడు మళ్లీ కొత్తగా రూ.115.86 కోట్లతో 32 రహదారుల నిర్మాణాలకు త్వరలో టెండర్లు పిలవనున్నారు.

విప్పితే పచ్చగంతలు.. కనపడవు పిచ్చిగుంతలు

సీఎం వై.ఎస్.జగన్ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన రహదారులు చక్కగా మెరిసిపోతున్నా టీడీపీ, జనసేనలకు కనిపించడం లేదు. అందుకే గత శని, ఆదివారాలు రెండురోజుల పాటు 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదీ' అంటూ వీరు చేసిన హడావుడిని చూసి జనం నవ్వుకుంటున్నారు. గ్రామీణ రహదారులు సైతం పాలుపోసి ఎత్తుకునేలా అగుపిస్తున్నా అగుపడనట్లు నటించిన వీరిపై కళ్లకు కట్టుకున్న పచ్చగంతలు విప్పితే కనపడవు పిచ్చి గుంతలు అంటూ ఎద్దేవా చేస్తున్నారు.



రూ. 355.24 లక్షలతో ఎర్రమిట్ట, వీవీ కండ్రిగ రోడ్డు నుంచి శాంతినగర్ వరకు నిర్మించిన రహదారి



రూ. 747.21 లక్షల అంచనా వ్యయంతో సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామం నుంచి సుంకేసుల వరకు నిర్మించిన రహదారి



చాపాడు మండలం రామచంద్రనగర్ కుచ్చుపాప నుంచి వెదురూరుకు వెళ్లే రహదారి



రూ. 621.61 లక్షల అంచనాతో పెండ్లిమర్రి మండలం రేపల్లె, కోనాయపల్లె మీదుగా నిర్మించిన చౌటపల్లె–పాత సంగటిపల్లె రహదారి



రూ. 220 లక్షల అంచనా వ్యయంతో చాపాడు మండలం నక్కలదిన్నె నుంచి కల్లూరు వరకు నిర్మించిన రహదారి

క్లుప్తంగా

హార్సిలీహిల్స్‌పై కొత్త సబ్ డీఎఫ్‌ఓలు

బి.కొత్తకోట : మదనపల్లె, పలమనేరు సబ్ డీఎఫ్‌ఓలుగా నియమితులైన ఎస్.శ్రీనివాసులు, వేణుగోపాల్‌లు రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డితో కలిసి శుక్రవారం బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. కొండపై ఉన్న అటవీశాఖ సముదాయం పరిశీలించారు. వేణుగోపాల్ మదనపల్లె రేంజర్‌గా పనిచేసిన సమయంలో జరిగిన అభివృద్ధి పనులను తిలకించారు. ఈ సందర్భంగా అటవీ సముదాయంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, జంతు ప్రదర్శనశాల ఆధునికీకరణ, ప్రకృతి అధ్యయన కేంద్రం అభివృద్ధి, అతిథిగృహాల ఆధునికీకరణ తదితర వాటిపై సమీక్షించారు.

వృద్ధుడిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

చిన్నమండెం : మండల కేంద్రంలోని రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొంది. శుక్రవారం ఈ సంఘటన చిన్నమండెం–పెద్దమండెం రహదారిపై చోటు చేసుకుంది. రెడ్డివారిపల్లెకు చెందిన వృద్ధుడు జాడయ్య నడుచుకుంటూ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది . ప్రమాదంలో కాలు విరిగి గాయపడిన వృద్ధుడిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కొరకు తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

చిట్స్‌తో పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

రాజంపేట : నందలూరు మండలం తోటపాళెంకు చెందిన అరిగెల రవిబాబు అనే వ్యక్తి చిట్స్ పేరుతో ప్రజల వద్ద నుంచి రూ.21 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో అరెస్టు చేసినట్లు సీఐ మంజునాథరెడ్డి, రాజంపేట రూరల్ ఎస్ఐ భక్తవత్సలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయనపల్లె గ్రామంకు చెందిన జాల అరుణ ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చిందన్నారు. అన్నమయ్య చిట్స్, ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఒక కంపెనీతో ఏర్పాటు చేశారన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రజల వద్ద నుంచి రూ.21,79,750 చిట్ పేరుతో నగదు వసూలు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గడువు మీరిన మద్యం ధ్వంసం



మద్యం బాటిళ్లు ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : ప్రభుత్వ వైన్ షాపులలో గడువు మీరిన మద్యాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు ధ్వంసం చేశారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి పట్టణ శివార్లలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని వైన్ షాపులలో గడువు మీరిన మద్యం బాటిళ్లను (సుమారు రూ.12,33,900ల విలువ చేసే మద్యం సీసాలను) ధ్వంసం చేసి కాల్చేశారు. ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ విజయవాడ, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డీసీ వారి ఆదేశాల మేరకు ఏపీఎస్‌బీసీఎల్ ఐఎంఎల్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ ఆయేషా బేగం, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ చంద్రహాస్, సుధాకర్‌ల ఆధ్వర్యంలో బాటిళ్లను పగలకొట్టి నిప్పంటించారు.

చిన్నారుల భవితవ్యానికి సహకారం

- భవిష్యత్తు తరాలకు భరోసాగా... ఉన్నత చదువులకు అండగా
- డీసీసీ బ్యాంకులో ఖాతాదారులకు పలు పథకాలు
- చిన్నారులకు ప్రత్యేక పొదుపు డిపాజిట్ ఖాతాలు
- జనవరి 30వ తేదీ వరకు రూ. 100తో ఖాతా
- కడప డీసీసీ బ్యాంకులో అమలుకు శ్రీకారం



కిడ్డీ బాక్స్‌ను అందజేస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ పీఎస్ గిరీషా, బ్యాంకు చైర్‌పర్సన్ ఎం. ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : రైతులు, ప్రజలకు సేవలందిస్తున్న జిల్లా సహకార బ్యాంకు మరో అడుగు ముందుకేసి చిన్నారుల భవిష్యత్తుకు ఆసరాగా నిలువనుంది. పిల్లలకు చదువుతోపాటు చిన్నతనం నుంచే పొదుపుపై అవగాహన కల్పించేందుకు, డబ్బు విలువను పిల్లలకు తెలియ చేసేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నడుం బిగించింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు తమ తల్లితండ్రులు పాఠశాలల్లో విశ్రాంత సమయంలో (ఇంటర్ వెల్) ఏవైనా తినుబండారాలను కొనుగోలు చేసుకునేందుకు ప్యాకెట్ మనీ కింద కొంత డబ్బులను ఇచ్చి పంపుతారు. వాటితో ఏదో రకమైన తినుబండారాలను కొనుగోలు చేసి తింటుంటారు. ఈ అడ్డగోలు తినుబండారాలు చిన్నారుల ఆరోగ్యాలకు చేటు చేయనున్నాయి. సంబంధిత వాటి నుంచి పిల్లలను దారి మళ్లించడంతోపాటు వారికి చిన్నతనం నుంచే పొదుపుపైన అవగాహన పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

చైర్‌పర్సన్ మదిలో మెదలిన ఆలోచనే..

డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి ఇటీవల బ్యాంకు సమావేశం నిమిత్తం కేరళకు క్యాంపు వెళ్లారు. అక్కడ ఓ పాఠశాలలో చిన్న కాయిన్ బాక్స్‌ను ఏర్పాటు చేసి ఉండటాన్ని గమనించారు. దీనిపై అక్కడ సిబ్బందితో ఆరా తీశారు. వారు చెప్పిన దానికి ఆమె ఇన్‌స్పైర్ అయ్యి మన జిల్లా పిల్లలకు కూడా ఇలాంటిది చేస్తే బాగుంటుందని తన మదిలో మెదలిన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. దీనిపై బ్యాంకు అధికారులతో సమీక్ష చేసి కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిపై బ్యాంకు సిబ్బంది కసరత్తు చేస్తూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంబంధిత కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. పిల్లలకు కావాల్సిన కిడ్డీ బాక్స్‌కు ఉచితంగా అందిస్తున్నారు. బ్యాంకు వారు చేసిన ఈ వినూత్న కార్యక్రమంపై పిల్లల తల్లితండ్రుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే వైఎస్సార్ కడప జిల్లాలో ప్రప్రథమంగా అమలు చేయడం హర్షణీయం.

వంద రూపాయలకే ఖాతా :

సాధారణంగా డీసీసీ బ్యాంకులో ఖాతా ప్రారంభించాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు కట్టించుకుని ఖాతాను ప్రారంభిస్తారు. అది కూడా చిన్నపిల్లలకు ఖాతాలను ప్రారంభించరు. అలాంటింది ప్రత్యేక కార్యక్రమం కింద చిన్నారులకు పొదుపు డిపాజిట్ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం డీసీసీ బ్యాంకు ప్రత్యేక మేళా ఏర్పాటు చేసి పుట్టిన బిడ్డ నుంచి 15 సంవత్సరాలోపు చిన్నారులకు ఖాతాను ప్రారంభిస్తున్నారు. ఈ విషయమై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ స్కీమ్‌ను ప్రస్తుతం ప్రత్యేక మేళా కింద 2024 జనవరి 30వ తేదీ వరకు వంద రూపాయలకే ఖాతాను తెరవనున్నారు.

చిన్నతనం నుంచే..

చిన్నారుల పేరుతో పొదుపు ఖాతాలను ప్రారంభించడం వల్ల వారికి పొదుపు ఆవస్యకత పెరగడంతోపాటు బ్యాంకింగ్ అలవాటు అవుతుంది. ఇందుకోసం కడప డీసీసీ బ్యాంకు వారు పిల్లలకు అవగాహన కల్పించేందుకు స్కూళ్లకు వెళ్లి కిడ్స్ బ్యాంకుపై అవగాహన కల్పిస్తున్నారు. ఖాతా ఓపెన్ చేసేవారికి కిడ్డీ బ్యాంకు (డబ్బా) ఉచితంగా పిల్లలకు అందిస్తున్నారు. పిల్లలు ఆ డబ్బాలో డబ్బు వేసుకోవాలని సూచనలిస్తున్నారు. అయితే ఆ డబ్బులో వేసిన డబ్బులను మళ్లీ పిల్లలు మనసు మార్చుకొని వెనక్కు తీసుకోకుండా ఆ డబ్బా తాళాలు బ్యాంకు వాళ్ల వద్ద పెట్టుకుంటారు. ఇలా పిల్లలు రోజువారిగా వేసే డబ్బులను నెల తర్వాత బ్యాంకుకు తీసుకుని వచ్చి పిల్లల ఖాతాలో జమచేయబడుతుంది. ఇలా డిపాజిట్ చేసిన డబ్బులకు బ్యాంకు వాళ్లు ఆకర్షణీయమైన వడ్డీని కూడా ఇవ్వనున్నారు.

ఆర్‌డీ ఖాతా కింద డిపాజిట్ చేస్తే 120 నెలల తర్వాత వచ్చే డబ్బు వివరాలు..

డిపాజిట్ నెలకు	గడువు తరువాత లభించే మొత్తం
రూ.100	రూ.17,730
రూ.500	రూ.86,851
రూ.1000	రూ.1,73,702
రూ.2000	రూ.3,47,403
రూ.3000	రూ.5,21,105
రూ.4000	రూ.6,94,807
రూ.5000	రూ.8,68,509
రూ.6000	రూ.10,12,210
రూ.7000	రూ.12,15,912
రూ.8000	రూ.13,89,614
రూ.9000	రూ.15,63,316
రూ.10000	రూ.17,37,017

120 నెలల తరువాత వచ్చే డబ్బుల వివరాలు..

డిపాజిట్ నెలకు	గడువు తరువాత లభించే మొత్తం
రూ.10,000	రూ.20,016
రూ.15,000	రూ.30,024
రూ.20,000	రూ.40,032
రూ.25,000	రూ.50,040
రూ.30,000	రూ.60,048
రూ.35,000	రూ.70,056
రూ.40,000	రూ.80,064
రూ.45,000	రూ.90,072
రూ.50,000	రూ.1,00,080
రూ. 1,00,000	రూ.2,00,160

కిడ్స్ రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ) ఖాతాలు :

పిల్లలకు మినిమమ్ డిపాజిట్ కింద రూ. 100 నుంచి అత్యధికంగా రూ. 10 వేల వరకు ఉంటుంది. ఇలాంటి డిపాజిట్ ఖాతాల కాల పరిమితి 120 నెలలు ఉంటుంది. ఇలాంటి డిపాజిట్లకు ఇన్సూరెన్స్ గ్యారెంటీ కూడా ఉంటుంది.

కిడ్స్ డిపాజిట్ (ఎఫ్‌డీఆర్)ఖాతాలు...

ఈ ఖాతా కింద మినిమం డిపాజిట్ కింద రూ. 10 వేలు ఉంటుంది. అత్యధికంగా డిపాజిట్ కింద రూ. లక్ష వరకు వేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి కూడా కాల పరిమితి 120 నెలలపాటు ఉంటుంది. ఈ డిపాజిట్‌పై వడ్డీ రేటు సంవత్సరానికి 7 శాతం ఉంటుంది. దీనిని నామినేషన్ సౌకర్యంతోపాటు డిపాజిట్లకు ఇన్సూరెన్స్ గ్రారెంటీ కూడా ఉంది.

పిల్లల ఉన్నత విద్యకు..



డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి సూచనల మేరకు చిన్నారులను చదువుతో పాటు పొదుపును ప్రోత్సహించడం కోసం డీసీసీ బ్యాంకు ప్రత్యేకంగా డిపాజిట్, పొదుపునకు సంబంధించి కొత్త స్కీంను ప్రారంభిస్తోంది. ఈ స్కీమ్ ద్వారా పిల్లలు పొదుపు, డిపాజిట్ చేసుకున్న డబ్బులను నేలకొకసారి తీసి బ్యాంకులో డిపాజిట్ చేస్తాం. ఆ డబ్బులు వారి ఉన్నత విద్య అండగా ఉపయోకపడతాయి. దీంతో పాటు వివాహం వంటి కీలకమైన బాధ్యతలను నేరవేర్చుటకు తల్లిదండ్రులకు కూడా ఆసరాగా ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే పొదుపుపై అవగాహన కల్పించాలి.
– కందుల రాజేంద్రకుమార్, సీఈఓ, డీసీసీ బ్యాంకు, కడప

కీచకోపాధ్యాయుడు గోపీనాథ్ సస్పెన్షన్



కీచక పీడీ గోపీనాథ్ సస్పెన్షన్‌పై వివరాలు వెల్లడిస్తున్న డీఈఓ శ్రీరామపురుషోత్తం

మదనపల్లె : విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన జెడ్పీహైస్కూల్ కీచక పీడీ గోపీనాథ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ శ్రీరామపురుషోత్తం తెలిపారు. శుక్రవారం కీచక టీచర్ శీర్షికన సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తాకథనానికి స్పందించిన ఆయన మదనపల్లెకు వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు. బాధిత బాలిక, తల్లి, తాతను పిలిచి జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమస్య తన ఒక్కదానిదే కాదని, తన సహ విద్యార్థులు పలువురు ఎదుర్కొన్నట్లు బాలిక తెలిపింది. తన ఆవేదనను గమనించిన కుటుంబసభ్యులు అండగా నిలవడంతో వారి సహాయంతో హెచ్‌ఎం సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేసినట్లు వివరించింది. దీంతో జరిగిన ఘటనలో పీడీ గోపీనాథ్ ప్రమేయం ఉందని నిర్ధారించుకున్న డీఈఓ శ్రీరామపురుషోత్తం అక్కడికక్కడే కీచక టీచర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లుగా బాధిత బాలికకు తెలిపారు. ఉపాధ్యాయులు ఎవరైనా తప్పుడు పనులకు పాల్పడినా సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదుచేసేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎంఓ కరుణాకర్, ఎంఈఓ రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాశాఖ చరిత్రలో విప్లవాత్మక మార్పులు

దేశచరిత్రలోనే విద్యాశాఖ అభివృద్ధికి సంబంధించి పెద్దమొత్తంలో నిధులు విడుదల చేసి, విద్యాశాఖ చరిత్రలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని డీఈఓ శ్రీరామపురుషోత్తం అన్నారు. శుక్రవారం మదనపల్లె పర్యటనలో భాగంగా జెడ్పీహైస్కూల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లాలో నాడు–నేడు పథకంలో భాగంగా మొదటివిడతలో రూ.173 కోట్లతో 605 పాఠశాలల్లో పది కాంపొనెంట్లకు సంబంధించి 100 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. రెండోవిడతలో భాగంగా రూ.350కోట్ల ఎస్టిమేట్‌తో 1,038 పాఠశాలల్లో పది కాంపొనెంట్లతో పాటుగా అదనపు తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. వీటిని నవంబర్ చివరిలోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మదనపల్లె మండలం టీకులపాలెంలో మధ్యాహ్నభోజనంలో బల్లి పడిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కారకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రుణాలుగా పొదుపు నిధులు



మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

బి.కొత్తకోట : మహిళా సంఘాల సభ్యులు పొదుపు చేసుకున్న డబ్బును రుణంగా వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌క్రాంతి పథం కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన సీసీలు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి కింద మంజూరుచేసిన రుణాలను సత్వరమే రికవరి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 15లోపు రికవరి చేయకపోతే రుణాల మంజూరు ఆగిపోతుందని చెప్పారు. మహిళా సంఘాల పొదుపు నిధులను అంతర్గత రుణాలుగా పంపిణీ చేయవచ్చన్నారు. జిల్లాలో 29,950 సంఘాల సభ్యులు రూ.284 కోట్లు పొదుపు చేశారని, ఈ నిధులు ఖాతాల్లో ఉందన్నారు. ఈ సొమ్ములో ఇప్పటివరకు రూ.75 కోట్లను రుణంగా అందించడం జరిగిందన్నారు. ఉపాధి కోసం జిల్లాలో 11 మంది మహిళా సంఘ సభ్యులను ఎంపిక చేసి వారికి ఆటోలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు 21,381 మందికి రూ.111.72 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం మంజూరు చేశామన్నారు. ఆటోలు పొందిన మహిళలు వడ్డీ లేకుండా రుణం చెల్లించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించినట్టు చెప్పారు. సమావేశంలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గాలివీడు : బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని తహసీల్దార్ దైవాదీనం, సీడీపీఓ పద్మావతమ్మ, ఎంపీడీఓ శేఖర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని నూలివీడు గ్రామం హరిజనవాడకు చెందిన వరుడితో రాయచోటి మండలం ఎగువ అబ్బవరం హరిజనవాడకు బాలికకు బాల్య వివాహాన్ని చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు అధికారులు సమాచారం అందింది. వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఇరువురి కుటుంబ సభ్యులను తహసీల్దార్ కార్యాలయంకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపివేశారు. మండల పోలీసులు, సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, హైమావతి, తులశమ్మ, వీఆర్‌ఓ, తదితరులు ఉన్నారు.



జగనన్న సురక్షతో ఎంతో లబ్ధి



జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది. అవసరమైన పలురకాల ధ్రువీకరణ పత్రాలు ఇంటివద్దకే చేరుతున్నాయి. మా కుటుంబానికి అవసరమైన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇటీవల జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో అందజేశారు. గతంలో ఏదైనా సర్టిఫికెట్ అవసరమైతే రెవెన్యూ, మున్సిపల్ అధికారుల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయవలసి వచ్చేది. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థల ఏర్పాటు ద్వారా మాకు అవసరమైన అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు సులువుగా పొందగలుగుతున్నాం.
– షేక్ బాబా ఫరీద్, కొత్తపల్లె, రాయచోటి

సొంతింటికల సాకారం



మాది అన్నమయ్య జిల్లా, సంబేపల్లె మండలం, గుట్టపల్లి గ్రామం, బావుల కాడపల్లె. మాకు సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నవరత్నాలలో ఇంటి స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం నుంచి అందిన సహకారంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ఇటీవల కొత్తగా కట్టుకున్న ఇంట్లోకి గృహప్రవేశం చేశాం. ఇంతకు ముందు అద్దెతో అవస్థలు పడుతూ నెట్టుకొచ్చిన మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందించిన ఇంటితో సొంతింటికల సాకారమైంది.
– నారా వెంకట గాయత్రి, గుట్టపల్లి గ్రామం

నాడు-నేడుతో ఉపాధ్యాయుల ప్రతిష్ట పెరిగింది



వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. దీంతో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తమకు కూడా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తుల నుండి ఎంతో మర్యాద పెరగడంతో పాటు చాలా గౌరవంగా వాళ్లు చూస్తున్నారు. ఈ క్రెడిట్ అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. మున్ముందు విద్యాభివృద్ధికి సీఎం జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారు.
– ఎస్ఎండీ జిక్రియాబాషా, చిన్నమండెం

క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

బి.కొత్తకోట : మండలంలోని శీలంవారిపల్లె ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు సోమశేఖర్‌రెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పనికి హాజరైన కూలీల వివరాలు నమోదులో నిర్లక్ష్యంగా వహించి కూలీలకు సంబంధంలేని ఫొటోను అప్‌లోడ్ చేశాడు. ఈ విషయాన్ని కమిషనర్ కార్యాలయంలో గుర్తించగా తక్షణ చర్యలకు ఆదేశించారు.

హార్సిలీహిల్స్‌లో ప్రకృతి అందాలు భేష్

– మంత్రి ఆదిమూలపు సురేష్



హార్సిలీహిల్స్‌పై విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి సురేష్

బి.కొత్తకోట : హార్సిలీహిల్స్‌పై నడుస్తుంటే ఆమెరికాలో ఉన్నట్లుందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం రాత్రి బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై గవర్నర్ బంగ్లాలో విడది చేసిన ఆయన సతీమణితో కలిసి కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవ వేడుక జరుపుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కొండపై పొగమంచు కురుస్తూ మేఘాలు కమ్మేశాయి. మంచులో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ మంత్రి పాత వ్యూపాయింట్ నుంచి కొత్త వ్యూపాయింట్ వరకు వాకింగ్ చేశారు. మధ్యలో ఇంజనీరింగ్ విద్యార్థులు కనిపించడంతో వారితో ముచ్చటించారు. ఇక్కడి ప్రకృతి అందాలు, వ్యూపాయింట్లు, వాతావరణం బాగున్నాయని మెచ్చుకున్నారు. అనంతరం ఉదయం 8 గంటలకు ఇక్కడినుంచి వెనుదిరిగి వెళ్లారు.

ఎర్రచెరువులో అక్రమ నిర్మాణాలను అరికట్టాలి



- హైవే రాకతో చెరువు కబ్జాల పరంపర
- సౌమ్యనాథాలయ మాజీ ఛైర్మన్ సౌమిత్రి

రాజంపేట : నందలూరు మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని ఎర్రిపాపయ్యగారిపల్లె సమీపంలో ఉన్న ఎర్రచెరువు యథేచ్ఛగా కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని నందలూరు వైఎస్సార్‌సీపీ నేత, సౌమ్యనాథాలయ మాజీ ఛైర్మన్ అరిగెల సౌమిత్రి ధ్వజమెత్తారు. శుక్రవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. చెరువు సమీపంలో కడప–రేణిగుంట జాతీయరహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. దీంతో ఎర్రచెరువు పరిధిలో చెరువుతట్టు భూములకు అమాంతంగా విలువ పెరిగిపోయిందన్నారు. ప్రతిపక్షానికి చెందిన నాయకుడు దర్జాగా శాశ్వత కట్టడం నిర్మించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టరు గిరీషా దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఆక్రమణలు తొలిగించే, చెరువును కబ్జా నుంచి విముక్తి కలిగించాలన్నారు. నందలూరు కన్యకల చెరువుపై ఆధారపడి జీవిస్తున్న నందలూరు గ్రామంలోని బెస్తలకు ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా తరతరాలుగా చెరువులు చేపలు పట్టుకొని జీవిస్తున్న వారు నివసిస్తున్న ప్రాంతం ఇరుకుగా మారిందని, కుటుంబాలు పెరిగాయన్నారు. నందలూరు చెరువుకు సమీపంలో ఉన్న ప్రభుత్వం స్థలాలను గుర్తించి మత్స్యకారులకు ఇళ్ల కోసం కేటాయించాలని కోరారు.

పోటాపోటీగా రెజ్లింగ్ జట్టు ఎంపికలు

- 28 నుంచి చండీఘర్‌లో పోటీలు
- ఎంపికైన జేఎన్‌టీయూ–ఏ రెజ్లింగ్ జట్టు



ఎంపికైన జేఎన్‌టీయూ–ఏ రెజ్లింగ్ జట్టుతో సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి

రాజంపేట : జేఎన్‌టీయూఏ ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ జట్టు ఎంపికలు పోటాపోటీగా ఏఐటీఎస్‌లో శుక్రవారం కొనసాగాయి. ఈ ఎంపికకు జేఎన్‌టీయూ–ఏ సెక్రటరీ ఆఫ్ స్పోర్ట్స్ కౌన్సిల్ జోజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ–ఏ తరపున పంజాబ్ చండీగర్ యూనివర్సిటీలో నవంబరు 28 నుంచి డిసెంబరు1వ తేదీ వరకు ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ రెజ్లింగ్ ఎంపికలు ఏఐటీఎస్‌లో జరగడం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైనా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టరు డా.నాగముని, ఎన్ఐఎస్ కోచ్ అండ్ రెఫరీలు గణేష్, రేణుక , అసిస్టెంట్ ఫిజికల్ డైరక్టరు సైపుల్లా పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ– ఏ రెజ్లింగ్ జట్టు ఇదే..

రెజ్లింగ్ జట్టును స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి ప్రకటించారు. కె.సాయివిఘ్నేశ్వరరెడ్డి(ఏఐటీఎస్,రాజంపేట), హరిప్రసాద్(వేము కాలేజి చిత్తూరు), కెబీఖాదర్‌బాషా(ఏఐటీఎస్,రాజంపేట), కె.జగన్‌మోహన్‌రెడ్డి (ఏఐటీఎస్,రాజంపేట), వెంకటేశ్(కడప), సుస్మిత(ఏఐటీఎస్,రాజంపేట), కె.అర్చన (ఎస్‌వీసీ, తిరుపతి), మునిశేఖర్ (ఏఐటీఎస్, రాజంపేట), వందన(కెఎస్ఆర్ఎం, కడప), సుమన్(ఏఐటీఎస్,రాజంపేట), విష్ణు (జేఎన్‌టీయుఏ ,అనంతపురం), అభిషేక్ (నారాయణ, గూడూరు), వంశీకృష్ణ (ఎస్‌వీసీ, తిరుపతి) జట్టుకు ఎంపికయ్యారు.

ముగిసిన బ్రహ్మంగారి జయంతి వేడుకలు





కలశాల గ్రామోత్సవంలో భక్తులు, బ్రహ్మంగారి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

- 415 కలశాలతో పుర వీధులలో ఊరేగింపు
- హోమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి కుమారులు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధ కర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 415వ జయంతి వేడుకలు శుక్రవారం మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆవరణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో 415 కలశాలకు ఆస్థాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్వపు మఠాధిపతి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రయ్యస్వామి దంపతులు పాల్గొని పూజలు చేశారు. పూజల అనంతరం భక్తులు కలశాలతో మఠం పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు. పార్కులో ఉన్న బ్రహ్మంగారి విగ్రహానికి అభిషేకం, క్షీరాభిషేకం చేశారు.